HICON SERIES

CLASS 5 TELUGU

తెలుగు వెలుగు 5

LESSON 4






CLICK HERE TO ACTIVATE

LESSON
PART 2

# 4 చిలుకమ్మ పెండ్లి

– కళాప్రపూర్ణ **గిడుగు వెంకట సీతాపతి**

చిలుకమ్మ పెండ్లియని
చెలికత్తెలందరును
చెట్లు సింగారించి
చేరి కూర్చున్నారు !!

పందిట పిచుకలు సందడిచేయగ
కాకుల మూకలు బాకాలూదగ
కప్పలు బెక బెక డప్పులు కొట్టగ
కొక్కొరొకో యని కోడి కూయగా

ఝుమ్మని తుమ్మెద తంబుర మీటగ
కుహు కుహు కోయని కోయల పాడగ
పిల్ల తెమ్మెరలు వేణువూదగా
నెమలి సొగసుగా నృత్యము చేయగ

సాలీడిచ్చిన చాపు కట్టుకొని
పెండ్లి కుమారుడు బింకము చూపగ
సీతాకోకల చీరె కట్టుకొని
పెండ్లి కుమారిత ప్రేమ చూపగ

మల్లిక మాలతి మాధవీలతలు
పెండ్లి కుమారుని పెండ్లి కూతురుని
దీవిస్తూ తమ పూవులు రాల్చగ
మైనా గోరింక మంత్రము చదివెను

చిలుకమ్మ మగడంత
చిరునవ్వు నవ్వుతూ
చిలుకమ్మ మెడ గట్టె
చింతాకు పుస్తె !!



**సారాంశం** చిలకమ్మకు పెళ్ళి చేయాలనుకొన్నారు. స్నేహితులందరూ చెట్లను అలంకరించి, వాటి పై కూర్చొన్నారు.

పెళ్ళి పందిట్లో పిచుకలు సందడి చేశాయి, కాకులు బాకాలూదాయి, కప్పలు బెక బెకమంటూ డప్పులు కొట్టాయి, కోడి కొక్కొరొక్కో అంటూ కూసింది.

"ఝుం" అంటూ తుమ్మెద తంబూరను మీటింది. కోకిల కుహుకుహూ అని తీయగా పాడింది. చల్లగాలులు మురళీరవాన్ని వినిపించాయి. మయూరం అందంగా నాట్యం చేసింది.

సాలీడు ఇచ్చిన పట్టు వస్త్రాలు కట్టుకొని పెళ్ళి కొడుకు ఠీవిగా వేదికపై కూర్చొన్నాడు. సీతాకోక చిలుకలవంటి రంగు రంగుల చీరె కట్టుకొని పెళ్ళికూతురు చిలకమ్మ కడు రమణీయంగా ముస్తాబైంది.

మల్లెలు, జాజులు మొదలైన చెట్లతీగెలు వధూవరులను దీవిస్తూ పుష్ప వర్షాన్ని కురిపించాయి. మైనా పెళ్ళి మంత్రాన్ని చదివింది.

పెళ్ళికుమారుడు చిరునవ్వుతో చిలకమ్మ మెడలో చింతాకు మంగళసూత్రాన్ని కట్టి కనువిందు చేశాడు.

## అభ్యాసం

I. **అర్థాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| చెలికత్తె | = | స్నేహితురాలు | బింకము | = | గర్వం |
| సింగారించి | = | అలంకరించి | పెండ్లి కుమారిత | = | పెళ్ళి కూతురు |
| మూకలు | = | గుంపులు | మాలతి | = | జాజిచెట్టు |
| తెమ్మెర | = | చల్లగాలి | లత | = | తీగ |
| సొగసు | = | అందం | పుస్తె | = | మంగళ సూత్రం |
| నృత్యము | = | నాట్యం | మగడు | = | భర్త |
| చాపు | = | బట్టల జత | గోరింక | = | గోరువంక పక్షి |

II. **పదజాలం**

**(అ) ఈ క్రింది మాటలను ఒకే వాక్యంలో ఉంచి సొంతవాక్యాలు రాయండి.**

1. పిచుకలు, చెట్టు, చిలుకమ్మ

_______________

వాక్యం : చెట్టు మీద ఉన్న చిలుకమ్మతో పిచుకలు స్నేహం చేశాయి.

2. కాకులు, లోకం, అనర్థం

_______________

3. మంత్రం, నృత్యం, నెమలి

_______________

4. పెండ్లికుమారుడు, దప్పులు, పెండ్లికూతురు

________________________________

5. వేణువు, చెలికత్తెలు, పరవశం

________________________________

**(ఆ) ఈ క్రింది మాటలను చదవండి. అదే అర్థాన్నిచ్చే మాటలను రాయండి.**

ఉదా : పెండ్లి : వివాహం, పరిణయం, పెళ్ళి.

1. చెట్టు : ____________
2. నెమలి : ____________
3. మగడు : ____________
4. మెడ : ____________
5. తుమ్మెద : ____________

**(ఇ) ఈ క్రింది పదాలకు వచనాలు రాయండి.**

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| ____________ | తెమ్మెరలు |
| కాకి | ____________ |
| ____________ | లతలు |
| చెలికత్తె | ____________ |
| బాకా | ____________ |
| ____________ | దప్పులు |

**(ఈ) 'పెండ్లి'కి సంబంధించిన పదాలు రాయండి.**

తాళిబొట్టు, తలంబ్రాలు మొ॥నవి.

____________ ____________

____________ ____________

____________ ____________

____________ ____________

## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు రెండు లేక మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. చెలికత్తెలు ఏం చేశారు ?
2. చిలకమ్మ పెండ్లికి సందడి చేసిందెవరు ? బాకాలు ఊదిందెవరు ?
3. చిలకమ్మ పెండ్లిలో లతలు ఏం చేశాయి ?
4. పెళ్ళివేడుకలో వధూవరులు ఎలాంటి వస్త్రాలు ధరించారు ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఆరు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. "చిలుకమ్మ పెండ్లి" గేయ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. మీ ప్రాంతంలో జరిగిన ఒక పెళ్ళి వేడుక గురించి రాయండి.

## IV. వ్యాకరణం

**ఈ క్రింద ఇచ్చిన వాక్యాలను చదవండి.**

1. రంజని పాట పాడింది.
2. శీను ఊరికి వెళ్ళాడు.
3. జాన్ పోటీలో గెలిచాడు.
4. గుర్రం వేగంగా పరిగెత్తింది.

పై వాక్యాలలో ( . ) కు ముందు క్రియా పదాలు ఉన్నాయి. అవి వాక్య భావాన్ని పూర్తయినట్లు తెలుపుతున్నాయి. ఈ విధంగా వాక్య భావాన్ని పూర్తిగా తెలిపే క్రియాపదాలను సమాపక క్రియలు అంటారు.

**ఈ క్రింది వాక్యాలను పరిశీలించండి.**

1. రాజు ఇక్కడకు వచ్చి,
2. వీణ అక్కడకు వెళ్లి,
3. నందన పాఠం చదివి,
4. రాధిక సినిమా చూసి,

పై వాక్యాలలో వచ్చి, వెళ్ళి, చదివి, చూసి వంటి క్రియా పదాలు పూర్తికాని పనిని తెలిపే పదాలు. వాక్య భావాన్ని అసంపూర్తిగా తెలుపుతున్న క్రియాపదాలివి. ఇలాంటి క్రియా పదాలను **అసమాపక క్రియలు** అంటారు.

(అ) ఈ క్రింది వాక్యాలలోని సమాపక, అసమాపక క్రియా పదాలను గుర్తించి రాయండి.

1. వెంకట్ బడికి పోయి, ఆటలు ఆడి, ఇంటికి వచ్చాడు.
2. శర్వాణి బట్టలు ఉతికి, స్నానంచేసి, గుడికి వెళ్ళింది.
3. రాఘవ కష్టపడి చదివి, ఉద్యోగం పొందాడు.
4. అబ్రహం సినిమా చూసి, పుస్తకాలు కొని, స్టేషనుకు వెళ్ళి, రైలెక్కాడు.

| సమాపక క్రియలు | అసమాపక క్రియలు |
|---|---|
| ________ | ________ |
| ________ | ________ |
| ________ | ________ |
| ________ | ________ |
| ________ | ________ |
| ________ | ________ |

## V. ప్రాజెక్టు పని



మీరు పాల్గొన్న ఒక వివాహవేడుకను వర్ణిస్తూ మీ స్నేహితునికి/స్నేహితురాలికి లేఖ రాయండి.

